


ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

కర్నూలు ఎడ్యుకేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): జేఈఈ-అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఆదివారం కర్నూలులో ప్రశాంతంగా జరిగింది. కర్నూలు నగరంలోని సనత్‌నగర్, అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ పరీక్ష ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరిగింది. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షల నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.

ముందుగానే తొలకరి పలకరించింది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దుక్కులు దున్ని విత్తనాలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మట్టిలో చిందించే స్వేదానికి దిగుబడి రూపంలో ఫలితం దక్కాలంటే 'విత్తనం' ఎంపికలో అన్నదాతలు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరకు వస్తాయనో.. ఉద్దర (అరువు) ఇస్తారనో నాసిరకం, నకిలీ విత్తనాలను నమ్ముకుంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. తెలంగాణ రాష్ట్రం భూత్‌పూర్ నుంచి ఇప్పటికే అనుమతి లేని బీటీ-2 పత్తి విత్తనాలు ఉమ్మడి జిల్లాలో పలు గ్రామాలకు చేర్చి, రహస్యంగా అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. అరికట్టడం, వాటివల్ల కలిగే నష్టంపై రైతుల్లో అవగాహన కల్పించడంలో వ్యవసాయ యంత్రాంగం వైఫల్యం చెందిందనే ఆరోపణలు లేకపోలేదు. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో దాదాపు 3.25 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారని అంచనా. వ్యవసాయ యంత్రాంగం అప్రమత్తమవ్వాలి. రైతులను ముంచేసే నాసిరకం పత్తి విత్తనాలు జిల్లాకు రాకుండా సరిహద్దుల్లోనే అడ్డుకోవాలి. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



నాసిరకం విత్తు.. నమ్మితే చిత్తు..!

కర్నూలు, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి ఉత్పత్తిలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలు మూడో స్థానంలో ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో కర్నూలు జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 4.19 లక్షల హెక్టార్లు. నంద్యాల జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 2.36 లక్షల హెక్టార్లు ఉమ్మడి జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 6.55 లక్షల హెక్టార్లలో పత్తి, వరి ధాన్యం, మిరప, కంది, మినుము.. వంటి పంటలు సాగు చేస్తున్నారు. అగ్రస్థానం బీటీ-2 పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో 3.25 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారని అంచనా. ఒక్క కర్నూలు జిల్లాలోనే 2.25 లక్షల హెక్టార్లలో సాగు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ఎకరాలకు 3 విత్తన ప్యాకెట్లు (హెక్టారుకు 7-8 ప్యాకెట్లు) పత్తి విత్తనాలు భూమిలో వేస్తారు. కొందరు రైతులైతే ఎకరాకు 4-5 ప్యాకెట్లు నాటుతున్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాకు 25-30 లక్షలు పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం అవుతాయని అంచనా. కర్నూలు జిల్లాలో 17-20 లక్షలు అవసరమైతే.. అందుబాటులో ఉన్నది కేవలం 15 లక్షలు ప్యాకెట్లే.

భూత్‌పూర్ టు కర్నూలు

తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ అనుమతి లేని, నాసికరం బీటీ-2 పత్తి విత్తనాలకు అడ్డాగా మారింది. భూత్‌పూర్ నుంచి కర్నూలు మండలం పంచలింగాల చెక్‌పోస్టు మీదుగా కర్నూలు, పాణ్యం, కోడుమూరు, డోన్ నియోజకవర్గాలకు, నందవరం మండలం నాగులదిన్నె చెక్‌పోస్టు దాటించి ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలకు, మంత్రాలయం మండలం మాధవరం చెక్‌పోస్టు దాటి మంత్రాలయం, ఆదోని, ఆలూరు నియోజకవర్గాలు, అలంపూర్ మండలం రాలంపాడు దగ్గర తుంగభద్ర నదిపై వంతెన దాటి నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం, నంద్యాల, బనగానపల్లె నియోజకవర్గాలకు నాసికరం పత్తి విత్తనాలు చేరవేస్తున్నట్లు సమాచారం. కోసిగి మండలానికి చెందిన ఓ బడా విత్తన వ్యాపారి (సెటిలర్) ఒకరు కర్ణాటక రాష్ట్రం రాయచూరును అడ్డాగా మార్చుకొని అక్రమంగా విత్తన వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం. అక్కడి నుంచి జిల్లాకు ప్రభుత్వ అనుమతుల పేరిట నాసికరం విత్తనాలు చేరవేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే భూత్‌పూర్, రాయచూరు నుంచి లక్షల బీటీ-2 పత్తి విత్తనాలు ఉమ్మడి జిల్లాలోని ఆయాగా గ్రామాల్లో రహస్య ప్రాంతాలకు చేర్చినట్లు సమాచారం. వ్యవసాయ, విజిలెన్స్ నిఘా యంత్రాంగం అప్రమత్తమై సరిహద్దులు దాటి రహస్యంగా జిల్లాకు చేరుతున్న నకిలీ, నాసికరం పత్తి విత్తనాలకు కళ్లెం వేయాలని పలువురు కోరుతున్నారు. ఆదోని పట్టణం ఆస్పత్రి రోడ్డులో జైన్ టెంపుల్ వీధిలో పెద్దఎత్తున నాసిరకం పత్తి విత్తనాలు విక్రయిస్తున్నా.. సంబంధిత అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పెరిగిన ధర.. రైతుపై భారం

బీటీ-2 పత్తి విత్తనాల కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గతేడాది 475 గ్రాములు (450 గ్రామలు బీటీ రకం, 25 గ్రాములు నాన్ బీటీ రకం) విత్తన ప్యాకెట్ కనీస మద్దతు ధర రూ.863 ఉండేది. ఈ ఏడాది రూ.901లకు పెంచారు. ఒక్కో ప్యాకెట్‌పైన రూ.38 పెరిగింది. ఉమ్మడి జిల్లాలో సరాసరి 25-30 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని



అంచనా. ఈ లెక్కన రూ.9.50 కోట్ల నుంచి రూ.11.50 కోట్లు పత్తి సాగు రైతులపై అదనపు భారం తప్పడం లేదు. అయితే.. 2023 ఖరీఫ్‌లో ఎకరాకు 6-8 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. 2024 ఖరీఫ్‌లో 8-12 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అదే క్రమంలో విత్తనోత్పత్తి దిగుబడి కూడా పెరగడం వల్ల వివిధ కాటన్ సీడ్ కంపెనీలు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయడంతో ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకు గ్రేడ్-1 కంపెనీలు పత్తి విత్తన ప్యాకెట్ ఒకటి రూ.750 - 850లకు, గ్రేడ్-2 కంపెనీల విత్తన ప్యాకెట్ రూ.650 - 750లకే విక్రయిస్తున్నామని ఆదోనికి చెందిన ప్రముఖ విత్తన వ్యాపారి ఒకరు పేర్కొన్నారు. గతేడాది డిమాండ్ ఉన్న ప్రముఖ కంపెనీల పత్తి విత్తనం నల్లబజారులో ఒక్కో ప్యాకెట్ రూ.1,200 నుంచి 1,400లకు విక్రయించిన మాట నిజమేనని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, రైతులు అనాథరైజ్డ్ విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని ఆ వ్యాపారి సూచిస్తున్నారు.

మిగతా 5వ పేజీలో

- ఉమ్మడి జిల్లాలో జోరుగా బీటీ-2 నాసిరకం పత్తి విత్తనాలు విక్రయం
- తెలంగాణ రాష్ట్రం భూత్‌పూర్ నుంచి సరఫరా
- తక్కువ ధర పేరిట మోసపోతున్న అన్నదాతలు
- యంత్రాంగం అప్రమత్తమైతేనే కష్టజీవులకు మేలు
- రైతుల్లో అవగాహన కల్పించడంలో వ్యవసాయాధికారులు విఫలం



జిల్లాలో గతంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బీటీ-2 పత్తి నాసిరకం విత్తనాల ప్యాకెట్లు (ఫైల్)

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం
- ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచనల ప్రకారం రానున్న రెండు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని తదనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖాధికారులను ఆదేశించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లకింద, బహిరంగ ప్రదేశాలలో ఉండకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పొలాల్లో పని చేసే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పని చేసేవారు, రైతులు పశువుల కాపరులు, గొర్రెల కాపరులు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని సూచించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

ఈ నెల 18, 19 తేదీల్లో భారీ వర్షాల సూచన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఏదైనా అవసమున్నా, సమాచారం అందించాలన్నా కంట్రోల్ రూం నెంబర్ : 08518-277305కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్

- కర్నూలు జిల్లాలో హాజరు కానున్న18,843 మంది విద్యార్థులు
- తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

కర్నూలు ఎడ్యుకేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయి. ఈ నెల 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసి ప్రవేశ పరీక్షలు ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు కొనసాగుతాయి. 14 సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారు. కర్నూలు జిల్లాలో మొత్తం 18,843 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఆదోనిలో ఇంజనీరింగ్ విభాగంలో 996 మంది, అగ్రికల్చర్, ఫార్మసికి 395 మంది రెండు కోర్సులకు కలిపి 5 మంది మొత్తం 1396 మంది దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలులో ఇంజనీరింగ్ విభాగంలో 9,933 మంది, అగ్రికల్చర్, ఫార్మసి కోర్సుల విభాగానికి 5,129 మంది, రెండు విభాగాలకు కలిపి 40 మంది మొత్తం 15,102 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మిగనూరులో ఇంజనీరింగ్ విభాగానికి 1544, అగ్రికల్చర్, ఫార్మసి విభాగాలకు 796, రెండు విభాగాలకు కలిపి 5 మంది మొత్తం 2,345 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలులో 7 పరీక్షా కేంద్రాలు, ఆదోనిలో 1, ఎమ్మిగనూరులో 1 పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరు. ఏదైనా సందేహాలుంటే 08842359599, 08842342499 నెంబర్లకు గానీ సంప్రదించాలన్నారు. ఏపీఈఏపీ సెట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు పరీక్ష నిర్వాహకులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

పరీక్ష కేంద్రాలు ఇవే

ఆదోనిలో భీమా ఇంజనీరింగ్ కళాశాల, ఎమ్మిగనూరులో సెయింట్ జోన్స్ ఇంజనీరింగ్ కళాశాల. కర్నూలులో అయాన్ డిజిటల్ జోన్ ఐడీజడ్, దూపాడు, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సనత్‌నగర్‌లోని అయాన్ డిజిటల్ జోన్, పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, కర్నూలు జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల, బృందావన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి 'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

జిల్లాలో హాజరు కానున్న 17,129 మంది విద్యార్థులు



కర్నూలు ఎడ్యుకేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 28 వరకు కొనసాగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు కొనసాగుతాయి. కర్నూలు జిల్లాలో 17,129 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 10,861 మంది, ప్రైవేటు విద్యార్థులు 5,532 మంది కాగా, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 736 మంది ఉన్నారు. జిల్లాలో ఈ విద్యార్థుల కోసం మొత్తం 69 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 69 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లుతో పాటు ఇన్విజిలేటర్లను విధుల్లో కేటాయించారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్షలో ఎలాంటి అవకతవకలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు.

ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం

- సి.క్యాంపు రైతు బజార్ అభివృద్ధికి రూ.6కోట్లు
- కార్పొరేషన్ ఎన్నికల్లో 33 వార్డులు గెలవాలి
- బీసీ భవన్ నిర్మాణానికి రూ.కోటి
- 'కర్నూలు మహానాడు'లో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న మంత్రి భరత్, సోమిశెట్టి

కర్నూలు అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆయన కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, కార్పొరేషన్ల డైరెక్టర్లు, నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు అనంతరం 'ఆపరేషన్ సిందూర్'లో ప్రాణాలర్పించిన జవాన్లకు సంతాపం తెలిపారు. అనంతరం కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ సీఎం కర్నూలు పర్యటనలో సి.క్యాంపులో రైతు బజారును అభివృద్ధి చేసేందుకు చంద్రబాబునాయుడు రూ. 6 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఓర్వకల్లు పారిశ్రామికవాడలో ఎన్నో పరిశ్రమలు రానున్నాయని, పాలనాపరమైన విధానాల కారణంగా ఒక్కొక్క అడుగు ముందు పడుతుందన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఇప్పటి నుంచే ప్రజల్లో గుర్తింపు తెచ్చుకోవాలని మంత్రి సూచించారు. తనకు ఒక విజన్ ఉందని ఆ క్రమంలోనే అభ్యర్థుల ఎంపిక చేపడతానని, నగరంలోని 33వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు గెలవాల్సిందేనన్నారు. కూటమి ప్రభుత్వం దశాబ్దకాలం పాటు అధికారంలో ఉండాలన్నారు. తెలుగేదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ కావడంతో ఆ వర్గానికి సంబంధించి 22వ వార్డులో బీసీ భవన్ నిర్మాణానికి తన వంతు రూ.కోటి సాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకులు, కార్యకర్తలు సోషియల్ మీడియా ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల డైరెక్టర్లు కోంకతి లక్ష్మీనారాయణ, సంజీవ లక్ష్మి, జేమ్స్, పోతురాజు రవీకుమార్, కార్పొరేటర్లు పరమేష్, జకియాఅక్సారీ, సుజాత, నీలో ఫర్, విజయకుమారి, సోమిశెట్టి నవీన్, అబ్బాస్, హమీద్, మాజీ కార్పొరేటర్లు, వార్డు , క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

జిల్లాలో వాన బీభత్సం

కర్నూలు అగ్రికల్చర్, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు విరగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆదివారం సగటున 9.7 ఎంఎం వర్షపాతం నమోదైంది. హాలహర్విలో అత్యధిక వర్షపాతం 83.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. కర్నూలు రూరల్‌లో 69.2 ఎంఎం, హోళగుందలో 64.1, కర్నూలు అర్బన్‌లో 62.1, కల్లూరులో 53.4, మద్దికెరలో 45.2, ఆలూరులో 41.8, ఎమ్మిగనూరులో 25.4, ఆస్పరిలో 26.1, తుగ్గలిలో 25ఎంఎం, కౌతాళంలో 22 ఎంఎం, సి.బెళగల్‌లో 15.4, దేవనకొండలో 15.4, కోడుమూరులో 19.2, పెద్దకడుబూరులో 17.6, ఆదోనిలో 15.7, చిప్పగిరిలో 15 ఎంఎం వర్షం కురిసింది. మే నెలలో 23.1 ఎంఎం వర్షం నమోదు కావాల్సి ఉండగా... ఆదివారం ఒక్కరోజే 9.7 ఎంఎం వర్షపాతం నమోదైందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.



కోడుమూరులో విరిగిపడ్డ భారీ వృక్షం

గాలివాన బీభత్సం

● దెబ్బతిన్న అరటి, మునగ, మామిడి తోటలు
● రూ.లక్షల్లో నష్టం

ఓర్వకల్లు, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు మామిడి, అరటి, మునగ తోటలు భారీగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులు, కౌలు రైతులు కన్నీరు పెడుతున్నారు. రూ.లక్షల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. మండలంలోని సోమయాజులపల్లె, కాల్వబుగ్గ, కాల్వ, చెన్నంచెట్టిపల్లె, కొమరోలు, సోమయాజులపల్లె గ్రామాల్లో అరటి, మునగ పంట నేలపాలు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే పాలకొలను, బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, మండ్లవానిపల్లె, రుద్రవరం తదితర గ్రామాల్లో మామిడి కాయలు నేలపాలయ్యాయి. పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులను ప్రభు త్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాలిపోయిన విద్యుత్ సామగ్రి

సి.బెళగల్: మండలంలోని సి.బెళగల్, ఇనండ్ల పోలకల్లు, కంబందహాల్, పలుకుదొడ్డి గ్రామాలలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి టీవీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు కాలిపోయయాయి. అలాగే విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. అధికారులు విద్యుత్ స్తంభాలను యుద్ధప్రాతిపదికగా పనులు చేపట్టారు.


విరిగిపడిన మునగ చెట్టు


నేలరాలిన మామిడి కాయలు


సోమయాజులపల్లెలో నేలవాలిన అరటి చెట్లు

తీవ్రంగా నష్టపోయాం

తాను రెండెకరాల్లో అరటి, ఎకరా పొలంలో మునగ పంట సాగుచేశా. గాలి, వానకు చెట్లు నేలకూలాయి. దీంతో తీవ్ర నష్టం సంభవించింది. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది అకాల వర్షం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు.
- ఆకుల వెంకటరెడ్డి, రైతు





ప్రభుత్వం ఆదుకోవాలి

మండలంలోని సోమయాజులపల్లె, కొమరోలు, చెన్నంచెట్టిపలె, వెంకటాపురం గ్రామాల్లో గాలి వానకు అరటి, మునగ పంటలకు తీవ్ర నష్టం సంభవించింది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- బోయ మనోహర్, రైతు

కార్యాలయాల ముట్టడిని జయప్రదం చేయండి

● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు


మాట్లాడుతున్న కరుణానిధి మూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 18(ఆంధ్రజ్యోతి): అసంబద్ధంగా ఉన్న పాఠశాలల పునర్విభజన, క్రమబద్ధీకరణ ఉత్తర్వులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19, 20, 21 తేదీల్లో డీఈవో కార్యాలయాలు, 23న విద్యా భవన్ ముట్టడిని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవన్ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధి మూర్తి మాట్లాడుతూ బదిలీల్లో, పదోన్నతుల్లో ఉన్న అసంబద్ధమైన విషయాలను తొలిగించిన తర్వాతనే బదిలీలు పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు, ఏపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, యూటీఎఫ్ రవికుమార్, ఏఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్, మరియానందం ఏపీటీఎఫ్-257 మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి రం గన్న, పీఆర్‌టీయూ ధనుంజయ, ఎన్‌వీ కృష్ణారెడ్డి, ఆపస్ జిల్లా అధ్య క్షుడు నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఏపీటీఏ మధుసూదన్ రెడ్డి, హుశేన్ పాల్గొన్నారు.

చల్లబడ్డ వాతావరణం

● తగ్గిన ఎండల తీవ్రత ● నగర వాసులకు ఉపశమనం

కర్నూలు అగ్రికల్చర్, మే 18(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాలో కురు స్తున్న వర్షాలకు వాతావరణం చల్లబడింది. 43 డిగ్రీల నుంచి 38 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. పొలాలు వర్షం నీటితో తడుస్తుండటంతో రైతులు దుక్కిదున్ని చేసుకుంటున్నారు. గత సంవత్సరం ఖరీఫ్‌లో మాదిరి ఈసారి కూడా మే చివరికల్లా పత్తి, మొక్క జొన్న, కంది, ఉల్లి, మిరప పంటలు రైతులు ముందస్తుగానే సాగు చేసేందుకు అవసర మైన విత్తనాల కోసం విత్తన డీలర్ల వద్ద క్యూ కడుతున్నారు. ఎండల తీవ్రతతో తల్లడిల్లుతున్న ప్రజానీకానికి తాత్కాలిక ఉపశమనం లభించింది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఐదారు డిగ్రీలు తగ్గాయి. కర్నూలు, కల్లూరు, కోడుమూ రు, పాణ్యం, ఎమ్మిగనూరు, డోన్, బనగానపల్లె, నందికొట్కూరు తదితర నియోజకవర్గాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ఈపరిస్థితుల్లో శని, ఆదివారం వర్షాలు కురవడంతో వాతావరణంలో మార్పు వచ్చింది.

పనులు చేసినా పస్తులే

● జీతం పెంచి ఉద్యోగ భద్రత కల్పించండి
● కమిషనర్‌కు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మొర


మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కర్నూలు అగ్రికల్చర్, మే 18 (ఆంధ్రజ్యోతి): పనులు చేస్తున్నా పస్తులు తప్పడం లేదని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.13వేలు జీతం సరిపోవడం లేదని, వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివారం మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీతకు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు మొర పెట్టుకున్నారు. కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను మార్కెటింగ్ శాఖ కమిషనర్ వద్దకు తీసుకెళ్లారు. వారి సమస్యలను కమిషనర్ చెప్పుకునేలా సానుభూతితో తీసుకునేలా కృషిచేయడంపై యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మధుసూదన్‌రెడ్డి, మద్దిలేటి జయలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విజ్ఞప్తిని కమిషనర్ విజయ సునీత సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం ద్వారా తప్పకుండా న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించుకోవాలి


వేసవి తరగతులను పరిశీలిస్తున్న గ్రంథాలయ అధికారి పెద్దక్క

కర్నూలు కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర గ్రంథాలయాల సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించుకోవాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి వి.పెద్దక్క అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో కొనసాగుతున్న విజ్ఞాన తరగతులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 56 శాఖా గ్రంథాలయాల్లో ఈ విజ్ఞాన తరగతులు జరుగుతున్నాయని, విద్యార్థులు తమ పేర్లు గ్రంథాలయంలో నమోదు చేసుకొని ఉచితంగా ఈ శిక్షణలు పొందవచ్చని సూచించారు. కాగా ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయం లో విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.నాగరాజు విద్యార్థులకు ఆంగ్లం గ్రామర్, చరిత్రకు సంబంధించిన విషయాలు తెలియజేయగా, మెడిటేషన్ తర గతులను ఇందుమతి నిర్వహించారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని యా గంటీశ్వరప్ప వివరించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు చెప్పడం, కథలు వినడం, జీకే తదితర అంశాలపై తరగతులు నిర్వహించారు.

రిజర్వేషన్ పథకాలకు కృషి చేయాలి

కర్నూలు న్యూసిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాలలకు రావాల్సిన న్యాయబద్ధమైన రిజర్వేషన్ పథకాలకు కూటమి ప్రభుత్వం కృషి చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పిడతల వెంకట స్వామి కోరారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. వెంకటస్వామి మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మాలలు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు.

నత్తనడకన..

● నగరపాలక సంస్థలో అటకెక్కిన అభివృద్ధి
● అధికారుల్లో లోపించిన సమన్వయం
● పనులపై తీవ్ర ప్రభావం
● రెండు గ్రూపులుగా కాంట్రాక్టర్లు, అధికారులు
● పట్టించుకోని ప్రజాప్రతినిధులు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల మధ్య సమన్వయం లోపంతో పనులు ముందుగు సాగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు, కాంట్రాక్టర్లు రెండు వర్గాలుగా విడిపోయారని పలువురు గుసగుసలాడుతున్నారు. దీంతో ఎవరికి వారే రాజకీయం చేస్తున్నారన్న ఆరోపణలు నగర పాలక సంస్థలో వినిపిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం కొంతమంది కాంట్రాక్టర్లు కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. తమకు బిల్లులు చెల్లించడం లేదంటూ పలుమార్లు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మరోవైపు టెండర్లు దక్కించుకున్న కొందరు కాంట్రాక్టర్లు పనులు చేయడం తో ఆయా కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యలో ప్రారంభించి వదిలేయడంతో పలు అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది.

కాంట్రాక్టర్లపై చర్యలు ఎక్కడ?

టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించకుంటే అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. అయితే ఇప్పటి వరకు ఏకాంట్రాక్టర్‌పై చర్యలు తీసు కున్న దాఖలాలు లేవు. మధ్యలో పనులు ఆపేసిన కాంట్రాక్టర్లపై కూడా చర్యలు తీసుకోవడానికి అధికారులు ముందుకు రావడం లేదు. నాణ్యతా ప్రమాణాలు పాటంచని కాంట్రాక్టర్లకు కూడా బిల్లులను సకాలంలో చెల్లించడం గమనార్హం. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధి పనులు ముందుకుసాగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గందరగోళం..

నగర పాలకలో రెండు వర్గాలు ఉన్నాయి. కాంట్రాక్టర్లు కూటమి ప్రభుత్వంలో చేరిపోయి రాజకీయం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో అభివృద్ధి పనుల విష యంలో గందరగోళం నెలకొంది. అంతే కాకుండా బిల్లుల సమస్య తీవ్రంగా ఉంది. పలువురు కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లుల కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యాలయంలో సిబ్బంది కొందరికే సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనుల్లో తీవ్ర జాప్యం

నగరంలో కొన్నినెలలుగా అభివృద్ధి పనుల్లో తీవ్రమైన జాప్యం కనిపిస్తోంది. ప్రజాప్రతినిధులు శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్నారు.. వెళ్లిపోతున్నారు.. తరువాత అవి ప్రారంభం అయ్యాయా లేదా అనే విషయంపై ఆరా తీయడం లేదు. నగర పరిదిలో సుమారు రూ.50కోట్ల విలువైన పనులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. కొందరు కాంట్రాక్టర్లు లెస్‌కు టెండరు వేసి దక్కించుకుని పనులు ప్రారంభించడం లేదని స్పష్టంగా చర్చించుకుంటున్నారు. పాతబస్తీ 2వ వార్డులో హజీరా కళాశాల నుంచి వాసవీ కళాశాల వరకు రూ.35 లక్షలతో మురుగునీటి కాలువను నిర్మించేందుకు గత నెలలో శిలాఫలకం వేశారు. నేటికీ ప్రారంభించలేదు. అదేవిధంగా 23వ వార్డు శ్రీరాం నగర్‌లో రూ.49.90లక్షలతో మురుగునీటి కాలువల నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇంకా పనులు ప్రారంభానికి నోచుకోలేదు.


శ్రీరామ్‌నగర్, పాతబస్తీ
రెండో వార్డులో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు (ఫైల్)

తెలుగు ఉపాధ్యాయుడికి డాక్టరేట్


శ్రీనివాసరెడ్డి

కర్నూలు కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని టౌన్ మోడల్ ఉన్నత పాఠశాల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎ.శ్రీనివా సరెడ్డి ఆదివారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తెలుగు సాహిత్యంపై ఎంతో ఆసక్తి ఉన్న ఆయన 'తెలుగు పత్రికల్లోని కథలు - పరిశీలన' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించారు. ఎస్వీ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు డాక్టర్ ఆర్ రాజేశ్వరమ్మ పర్యవేక్షణలో ఈ సిద్ధాంత గ్రంథాన్ని ఆయన రచించారు. తెలుగు కథల్లోని మాండలీకాలు, సామాజిక, మానవీయ కోణాలు ఆయన గొప్పగా చూపించారు. అలాగే తెలుగు భాషలోని కథ లకు ఇతర భాషా కథల మధ్యగల వ్యత్యాసాన్ని, తెలుగు కథలు సాగే తీరును ఆయన అనేక ప్రామాణికాల మధ్య వివరించారు. ఈ నేపథ్యం లో ఎస్వీ యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ పట్టా ఇచ్చింది. శ్రీనివా సరెడ్డికి డాక్టరేట్ రావడంపై సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణి యాద వ్‌లు అభినందలు తెలియజేశారు.

తైక్వాండో క్రీడా పరికరాల పంపిణీ


స్పోర్ట్స్ కిట్లు అందుకున్న క్రీడాకారులతో నారాయణ విద్యాసంస్థల ఏజీఎం రమేష్, శ్రీనివాసులు

కర్నూలు స్పోర్ట్స్, మే 18(ఆంధ్రజ్యోతి): తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సాధన చేసే పరికరాలు పంపిణీ కార్యక్రమాన్ని తైక్వాండో కోచ్ టి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆది వారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల ఏజీఎం రమేష్ కుమార్, న్యాయవాది శ్రీనివాసులు హాజరై కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ వారు వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థులకు పరికరాలు, సర్టిఫికేట్లు అందజేసి సహకరిస్తుండటం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో అజయ్, తేజ, సూర్య భార్గవ్, మల్లికార్జున, తిలక్, అఖిల్ పాల్గొన్నారు.

నేడు నగర పాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30గంటల నుంచి ప్రారంభమవుతుందని, అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిదిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు క్రైం, మే 18(ఆంధ్రజ్యోతి) : రౌడీ షీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలికి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసు అధికారులు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంతరణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిల్లో పోలీసు అధికారులు ఆదివారం సాయంత్రం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా: సీఐ

సి.బెళగల్, మే 18(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. ఆదివారం మండలంలోని బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. గ్రామాల్లో రచ్చకట్ట పంచాయితీలు నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ పరమేష్‌నాయక్, పోలీసులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బనగానపల్లె, మే 18 (ఆంధ్రజ్యోతి) : లారీ అదుపుతప్పి చెట్టు ను ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. బనగానపల్లె మండలం హుశేనాపురం గ్రామ సమీపంలో ఈఘటన చోటుచేసుకున్నట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలు.. బనగానపల్లెకు చెందిన గౌతమ్‌గౌడు(21) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడు లారీలో వెళ్తుండగా హుశేనాపురం సమీపంలోకి అలారీ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. గౌతంగౌడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందివర్గం ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు..

బేతంచెర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన నాగేశ్వరరావు(40) అనే రైతు చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. రుద్రవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే రైతు తనకున్న 8 ఎకరాల పొలంలో వ్యవసాయం సాగు చేసేవాడు. కుటుంబ, వ్యసా యానికి ఇతరుల వద్ద రూ.19.50 లక్షలు అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. భార్య శాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు


కర్నూలులో జరిగిన నియోజకవర్గ స్థాయి మహానాడుకు తరలివెళ్తున్న గూడూరు టీడీపీ శ్రేణులు

గూడూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన కోడుమూరు నియోజకవర్గ స్థాయి మహానాడుకు గూడూరు పట్టణం నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లాయి. ఆదివారం గూడూరు నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. కె రామాంజనేయులు మాట్లాడుతూ కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పిలుపు మేరకు మినీ మహానాడుకు గూడూరు నుంచి పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు తరలి వెళ్లారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సృజన్, రేమట వెంకటేష్, కౌన్సిలర్లు రేమట సురేష్, కోడుమూరు షాషావలి, కుమ్మరి ఎల్లయ్య, చాంద్ బాషా, నాగప్ప యాదవ్, హనుమంతు, నాయుడు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

● టీడీపీ శ్రేణులకు గౌరు దంపతుల పిలుపు

కల్లూరు, మే 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పాణ్యం నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 20న నంద్యాల రోడ్డులోని ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించే మహానాడుకు పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్ 16వార్డులు, కల్లూరు, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండల స్థాయి, గ్రామస్థాయి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, బూత్ కన్వీనర్లు, ఇన్‌చార్జిలు హాజరై మహానాడును విజయవంతం చేయాలని గౌరు దంపతులు పిలుపునిచ్చారు.

దూదేకుల సంక్షేమం కోసం పాటుపడుదాం

కర్నూలు ఎడ్యుకేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): దూదేకుల సంక్షేమం కోసం పాటు పడుదామని రిటైర్డు ఎస్పీ షేక్షావలి, అడిషినల్ ఎస్పీ హుశేన్ పీరా తెలిపారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి దూదేకుల సంఘం రాష్ట్ర నేతలు సిద్దయ్య, కన్నయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలు, వారి సంక్షేమం గురించి చర్చించడంతో పాటు సంఘం కార్యకలాపాలు ఎలా ముందుకు తీసుకెళ్లాలో వంటి విషయాలు చర్చించారు. అనంతరం కర్నూలు జిల్లా దూదేకుల ఉద్యోగల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా గోకారి, మౌలాలి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కే.ఖాదర్‌బాషా, దివాన్ సాహేబ్, జిల్లా కోశాధికారిగా రోషన్, ఉపాధ్యక్షులు బాబు సుభాన్, సలీం, సంయుక్త కార్యదర్శిగా ఖాశీం, షేక్షావలి, రఫీ, రుక్మాన హుశేన్, సుభాష్‌లను ఎన్నుకున్నారు.

ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలి

కర్నూలు న్యూసిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేయాలని రక్షణ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు యు.సుంకన్న ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఉచిత బస్సు పథకం వల్ల ఆటో, టాక్సీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో ఆర్టీసి పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. ఒక్క నెలకు ఆర్టీసికి సుమారు రూ.200 కోట్ల నష్టం వస్తుందన్నారు. ఆటో కార్మికులు, ఆర్టీసీ సంస్థను రక్షించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రీసెర్చ్ డీన్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ విశ్వనాథరెడ్డిపై చర్యలు తీసుకోవాలని బహుజన విద్యార్థి జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ డిమాండ్ చేశారు. ఆదివారం నగరం లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ కళాశాల డీన్‌కు అక్రమ మార్గంలో పీహెచ్‌డీ పూర్తి చేయాలని కుట్రతో గైడ్‌తో సంబంధం లేకుండా రీసెర్చ్ డీన్ కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఆ పీహెచ్‌డీని వెంటనే రద్దు చేయాలని, రీసెర్చ్ డీన్‌ను సస్పెండ్ చేయాలని కోరారు.

దర్గాలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): పాతనగరంలో చిన్న మార్కెట్ సమీపంలోని హజ్రత్ సయ్యద్‌షా ఖాలిక్ లింగ జగద్గురు దర్గా 295వ ఉరుసులో కర్నూలు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్ని పీఠాధిపతి, ఇతర మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ కర్నూలు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు బాషా, నాయకులు అక్బర్, మెహ్ఫూజ్, శంకర్ పాల్గొన్నారు.

నాసిరకం విత్తు.. నమ్మితే చిత్తు..!

3వ పేజీ తరువాయి

పత్తి విత్తనోత్పత్తి రైతులు పండించిన పత్తి విత్తనాలను వివిధ విత్తన కంపెనీలు ముందస్తు ఒప్పందం మేరకు 450 గ్రాముల ప్యాకెట్ రూ.400-450లకు తీసుకుంటున్నారని ఓ రైతు తెలిపారు. ఎకరాకు 550-600 ప్యాకెట్లు (2.50 - 2.70 క్వింటాళ్లు) దిగుబడి వస్తుందని అంచనా. గ్రో-అవుట్ టెస్ట్ (జీవోటీ), జెనెటికల్లి మోడిఫైడ్ ఆర్గనిజమ్స్ (జీఎంవో) టెస్టులు రైతులే చేయించాలి. ఆ టెస్టుల్లో ఉత్తమ ఫలితాలు వస్తేనే తీసుకుంటాయి. ఆ విత్తనాలను కంపెనీ లేబుల్‌పై మార్కెట్‌లో ఒక్కో ప్యాకెట్ కనీస మద్దతు ధర రూ.901లకు విక్రయిస్తున్నారు. విత్తన కంపెనీలు ధర గిట్టుబాటుకాక, విత్తనోత్పత్తి రైతులు ఒప్పందం ప్రకారం ఎకరాకు 400-450 ప్యాకెట్లు కంపెనీలకు ఇచ్చి, మిగిలిన విత్తనాలు మధ్య దళారులు ద్వారా అనధికారిక అమ్మకాలు సాగిస్తున్నారు. కొందరు దళారులైతే జీవోటీ, జీఎంవో పరీక్షల్లో సరైన ఫలితాలు రాని విత్తనాలను సేకరించి, వాటిని నాణ్యమైన విత్తనాలలో కలిపి వివిధ లేబుల్స్ పేరిట ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బూత్‌పూర్ అడ్డాగా ఈ బాగోతం సాగుతున్నట్లు సమాచారం. తక్కువ ధరకు వస్తాయని నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి మోసపోతున్నారు. నాసిరకం, అనుమతి లేని విత్తనాలు వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఎకరాకు 3-4 క్వింటాళ్లు దిగుబడి కోల్పోవాల్సి వస్తుందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ విషయాలపై రైతుల్లో అవగాహన కల్పించడంలో వ్యవసాయ అధికారులు వైఫల్యం చెందారనే ఆరోపణలు లేకపోలేదు.

జాగ్రత్తలు పాటించాలి

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి
- విత్తన ప్యాకెట్లపై పేరు, గడువు తేదీ వివరాలు తప్పకుండా గమనించాలి
- సీలు వేసిన బస్తాలు, ధృవీకరణ పత్రాలు ఉన్న విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలి
- రసీదు తప్పకుండా తీసుకోవాలి. ఆ రసీదుపై విత్తనం రకం, గడువు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేయడానికి ముందు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం ఉత్తమం.

● 475 గ్రాముల బీటీ-2 పత్తి విత్తన ప్యాకెట్ కనీస మద్దతు ధర పెరుగుదల ఇలా:

సంవత్సరం	ఎమ్మార్పీ	భారం
2019	710	--
2020	730	20
2021	767	37
2022	810	80
2023	853	43
2024	863	10
2025	901	38

ప్రత్యేక బృందాలతో నిఘా

జిల్లాల్లో ఈ ఏడాది 2.25 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తారని అంచనా. ఎకరాకు 3 ప్యాకెట్లు పత్తి విత్తనాలు భూమిలో వేస్తున్నారు. ప్రస్తుతం 15 లక్షల విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. నాసికరం, అనుమతి లేని విత్తనాలు గ్రామాల్లో అమ్మకాలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. నిరోధించడానికి ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం. ఏ గ్రామంలోనైనా అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం ఇస్తే దాడులు చేస్తాం. రైతులు కూడా అనుమతి లేని విత్తనాలు కొనుగోలు చేయరాదు. దీనిపై రైతుల్లో చైతన్యం తీసుకొస్తాం.

- వరలక్ష్మి, జేడీ, వ్యవసాయ శాఖ, కర్నూలు

పేగుల ఆరోగ్యం ఎంతో కీలకం

● గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ దువ్వూరి నాగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి

కర్నూలు హస్పిటల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పేగుల ఆరోగ్యం సరిగ్గా లేకపోతే జీర్ణక్రియకు సంబంధించిన సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, పేగుల ఆరోగ్యం రానున్న రోజుల్లో ఎంతో కీలకం కానుందని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ చైర్మన్, పద్మవిభూషణ్ డాక్టర్ దువ్వూరి నాగేశ్వరరెడ్డి అన్నారు. కర్నూలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఐఎంఏ భవన్‌లో డా.కేబీ కృష్ణమోహన్ మెమోరియల్ స్మారక ఉపన్యాసంలో భాగంగా పేగుల ఆరోగ్యంపై ఆయన మాట్లాడారు. పేగుల్లో మంచి బ్యాక్టీరితో అనేక లాభాలు ఉన్నాయని, అవి చెడిపోతే హార్ట్, కిడ్నీ, బ్రెయిన్ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పేగుల్లో చెడ్డ బ్యాక్టీరియా రావడానికి ప్రధానంగా మహిళలు సిజేరియన్ ఆపరేషన్లు చేయించుకోవడం తల్లులు పిల్లలకు 6 నెలల వరకు పాలు ఇవ్వకపోవడం, పిల్లలకు 6 నెలల వయస్సు వరకు పిల్లలు యాంటి బయాటిక్స్ వాడటం వంటి మూడు కారణాల వల్ల చెడు బ్యాక్టీరియాలు వస్తాయన్నారు.

'40 శాతం పిల్లల్లో ఫ్యాటీ లివర్'

ఇటీవల హైదరాబాదులో స్కూల్ పిల్లలపై చేసిన సర్వేలో 30 నుంచి 40 శాతం చెడ్డ బ్యాక్టీరియాతో పాటు ఫ్యాటీ లివర్ ఉన్నట్లు గుర్తించినట్లు డాక్టర్ నాగేశ్వరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల పిల్లల్లో లివర్ చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఫాస్ట్‌ఫుడ్‌లోని రసాయనాల వల్ల చెడు బ్యాక్టీరియా వచ్చే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో స్టూల్ (మలం) సంబంధిత ఫీకల్ మైక్రో బయోట్రాన్స్ ప్లాంటు థెరపీలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయనీ, ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా స్టూల్ బ్యాంకులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. రానున్న రోజుల్లో ఎంఎఫ్‌టీ ద్వారా స్టూల్ చికిత్స రానున్నదని, కొత్తగా పిల్‌బాల్ ద్వారా ఎండోస్కోపి విధానం చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యవంతుల నుంచి సేకరించిన స్టూల్ నమూనాల నుంచి తీసిన గట్ మైక్రోబయోమ్స్‌ను ఉపయోగించి రోగులకు మార్పిడి చేసే జీర్ణ సంబంధిత వ్యాధులను నయం చేసే దిశగా పరిశోధనలు సాగుతున్నాయన్నారు. డయాబెటిక్‌లో టైప్-1 పిల్లల్లో, టైప్-2 పెద్దల్లో వస్తుందని, టైప్-3 ప్రాంక్రియాస్ చెడిపోవడం వల్ల వస్తుందన్నారు. ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు ఆ.రామచంద్ర నాయుడు, డా.ఎస్‌వీ రామ్మోహన్ రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు డా.బి.శంకర్‌శర్మ, డాక్టర్ వీ.వెంకటరంగారెడద్ది, ఐఎంఏ కోశాధికారి డా.మాధవి శ్యామల, వైద్యులు పాల్గొన్నారు.

తుగ్గలిలో వజ్రం లభ్యం

తుగ్గలి, మే 18 (ఆంధ్రజ్యోతి): తొలకరి జల్లులు కురవడంతో ఓ వ్యవసాయ కూలీకి వజ్రం లభ్యమైంది. ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలిలో వ్యవసాయ పనులు చేస్తున్న ఓ కూలీకి వజ్రం దొరకడంతో జొన్నగిరికి చెందిన ఓ వజ్రాల వ్యాపారి రూ.1.50 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం. తొలకరి జల్లులు కురిసినప్పుడు జొన్నగిరి, పగిడిరాయి, ఉప్పర్లపల్లి తదితర గ్రామాల్లో విరివిగా వజ్రాలు లభిస్తుంటాయి.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

ఆలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆస్పరికి చెందిన బీటెక్ విద్యార్థి ఆనంద్(19) శనివారం అర్ధరాత్రి ఆలూరు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా తెలిపిన వివారల మేరకు.. ఆస్పరికి చెందిన తిమ్మన్న, శకుంతల దంపతుల కుమారుడు ఆనంద్ గుంటూరు జిల్లా ఆర్‌బీ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. తన సోదరి వివాహం కోసం ఇద్దరు స్నేహితులతో కలిసి హొళగుంద మండలం వందవాగిలి గ్రామంలో ఆదివారం జరగనుండడంతో స్నేహితులు పూర్ణ చంద్ర, తిమ్మప్పతో కలిసి ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి వస్తున్నారు. ఆదోని నుంచి వస్తున్న ఓ వాహనం ఆలూరు శివారులో మారెమ్మవ్వ ఆలయం వద్ద అదుపు తప్పి మోటర్‌సైకిల్‌ను ఢీకొనడంతో ఆనంద్ అక్కడికక్కడే మృతిచెందగా తిమ్మప్ప,పూర్ణచంద్ర గాయపడ్డారు. గాయపడిన వారిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఆనంద్ మృతిచెందడంతో ఆదివారం జరగాల్సిన తన సోదరి వివాహం ఆగిపోయింది.

మహిమాన్వితురాలు..

మహాయోగి లక్ష్మమ్మ అవ్వ



విద్యుద్దీపాలంకరణలో లక్ష్మమ్మ అవ్వ ఆలయం

- కొలిచేవారికి కొంగుబంగారం
- విద్యుద్దీపాలతో ఆలయం అలంకరణ
- అవ్వ మహాద్వారం ఏర్పాటుతో కొత్తశోభ
- నేడు ఆదోనిలో మహా రథోత్సవం



ఆదోని , మే18 (ఆంధ్రజ్యోతి): మహిమాన్వితురాలు మహాయోగి లక్ష్మమ్మ అవ్వ. తన మహిమలతో సమసమాజం కోసం కృషిచేశారు. అవధూతగా లక్షల మంది నీరాజనాలు అందుకుంటున్నారు. కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మహాయోగి లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం ఆదోని పట్టణంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు జరుగనుంది. సోమవారం తెల్లవారుజామున నుంచే అవ్వ దర్శనం కోసం భక్తులు బారులు తీరనున్నారు. అంతకుముందు అవ్వ మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అవ్వ బృందావనాన్ని, మూల విరాట్‌కు బెంగళూరు నుంచి తెప్పించిన పూలతో అలంకరిస్తారు. మహా రథోత్సవాన్ని పురస్కరించుకొని ఆదోని పట్టణంలోని అవ్వ అలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మహిమలు ప్రదర్శిస్తూ...

మహాయోగి లక్ష్మమ్మ అవ్వకు ఘన చరిత్ర ఉంది. ఆలూరు మండలం ముసానపల్లి గ్రామానికి చెందిన దళిత దంపతులు మంగమ్మ, బండెప్పల రెండో కుమార్తె చిన్న లక్ష్మమ్మ. ఆమెకు యుక్త వయస్సు రాగానే కర్ణాటకలోని ఇమ్రాపురం గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. కారుణ జన్మరాలైన లక్ష్మమ్మ సాధారణ మహిళగా జీవనం సాగించలేకపోయింది. సమసమాజ స్థాపనతో పాటు ప్రేమ, దయ, దానం ధర్మం, ఆధ్యాత్మికతను వ్యాపింపజేసేందుకు ఆమె నడుం బిగించారు. తాను ఆశించిన సమాజ ఆవిష్కరణ కోసం ఎన్నో మహిమలు ప్రదర్శిస్తూ ఊరూరు తిరిగారు. ఎంతోమందిలో మార్పు తెస్తూ ఆదోనికి చేరారు. తాను సంకల్పించిన సమాజం ఆవిష్కరానికి బీజం పడిందని తెలుసుకున్న మహా సాధ్విని 1933మే 16వ తేదీన పరబ్రహ్మతో లీనమయ్యారు. తాము కోరిన కోరికలను తీర్చిన అవ్వ ఇకలేరని తెలుసుకున్న లక్షలాదిమంది భక్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆమె పరబ్రహ్మలో లీనమైన చోటే బృందావనం ఏర్పాటుచేశారు. కారుణ్యమూర్తి అయిన అవ్వ పరబ్రహ్మలో లీనమైన రోజు వైశాఖ బహుళ సప్తమినాడు మహారథోత్సవం నిర్వహిస్తున్నారు.

భక్తుల సహకారంతో వెండి రథం

భక్తుల సహకారంతో ఆలయ నిర్వాహకులు 93 ఏళ్ల క్రితం వెండి రథం ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఈరథంలోనే అవ్వ ఊరేగుతున్నారు. అవ్వ మూలవిరాట్, ఉత్సవ విగ్రహంతో పాటు ఆలయంలోని అవ్వ గర్భగుడి, బృందావనానికి కూడా వెండి తొడుగులు ఏర్పాటుచేశారు. పట్టణ ప్రముఖులు రాచోటి కుటుంబానికి చెందిన వారు ఆలయానికి వంశ పారంపర్య ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ధర్మకర్తగా ఉన్నారు.

రథోత్సవం అగ్రభాగాన దళితులు

అవ్వ రథోత్సవంలో ముసానపల్లికి చెందిన దళితులు అగ్రభాగాన కొనసాగుతారు. దళితులు రథోత్సవంలో అగ్రభాగాన ఉండడం అవ్వ సంకల్పంగా పేర్కొంటారు. దళిత ముత్తైదువులు కలశాలతో కొనసాగగా పురుషులు కాషాయ జండాలతో నడుస్తారు. ఉదయమే పల్లకోత్సవంతో ముసానపల్లె నుంచి ఊరేగింపుగా వచ్చి ఆలయానికి చేరి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముసానపల్లెలో కూడా ఆలయం నిర్మించారు. అక్కడ కూడా మహాయోగిని నిత్యపూజలు అందుకుంటున్నారు.

రూ. కోటితో అవ్వ మహా ద్వారం

ఆదోని పట్టణంలోని ఆలూరు రోడ్డులో రూ.కోటితో అవ్వ మహా ద్వారం నిర్మించారు. పట్టణా నికి మహాద్వారం నిర్మించడంతో ఎంతో అందం తెచ్చిపెట్టింది పట్టణానికి వచ్చే వారికి అవ్వ ఆహ్వానం పలుకుతున్నట్లు ఉందని పలువురు భక్తులు పేర్కొంటున్నారు.

అన్నిఏర్పాట్లు: అవ్వ సంకల్పం మేరకు సామాజిక కార్యక్రమాలు రాచోటి రామయ్య, అవ్వ ఆలయం వంశపారంపర్య ధర్మకర్త అవ్వ సంకల్పం మేరకు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భక్తులు కూడా అవ్వసన్నిదిలో చేపట్టే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తున్నారు. సోమవారం జరిగే మహారథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశాం. నీడ కోసం షామియానాలు, దాహార్తి తీర్చేందుకు తాగునీరు ఏర్పాటు చేశాం. జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక నుంచి లక్షల మంది భక్తులు రథోత్సవంలో పాల్గొంటారు.

సీఎం పర్యటన విజయవంతం

● కూటమి శ్రేణులకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, మే 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు కర్నూలు పర్యటనను విజయవంతమైందని, ఇందుకు కూటమి నాయకులు, కార్యకర్తలకు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ధన్యవాదాలు తెలిపారు. పాణ్యం నియోజకవర్గం అభివృద్ధికి సీఎం చంద్రబాబు వరాలు ప్రకటించడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పార్కులు వంటి మౌలిక వసతుల కల్పనకు సీఎం ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారన్నారు. అందులో భాగంగానే రూ.50కోట్ల నిధుల విడుదలకు ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు. తక్షణమే కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నుంచి రూ.5 కోట్లు, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.3 కోట్లు మొత్తం 8కోట్ల నిధుల విడుదలకు మున్సిపల్‌శాఖ మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని గౌరు చరిత వివరించారు. నియోజకవర్గం పరిధిలోని శివారుల ప్రాంతాలు, కాలనీల్లో త్వరలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా కల్లూరు అర్బన్ 16 వార్డుల తాగునీటి సరఫరా కోసం గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు ప్రక్రియను ప్రాధాన్యతా అంశంగా పరిగణించి ప్రజలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అంతే కాకుండా సఫా కాలేజీ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు రహదారి పనులు మంజూరైన గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. అనుమతి రాగానే పనులు పూర్తికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

● కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఆదివారం కోడుమూరు నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే బలం అని, రానున్న రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని, పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే నిజమైన సైనికులు అన్నారు. అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ ఆశయాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే జిల్లా మహానాడు, తర్వాత కడపలో జరిగే మహానాడును ధిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. కేడీసీసీబీ చైర్మన్‌గా ఎంపికైన ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో ఎలాంటి వర్గ విభేదాలు లేవని, నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. రాబోయే 27వ తేదీన జరగబోయే మహానాడు కార్యక్రమాన్ని భారీ ఎత్తున జయప్రదం చేయాలని కోరారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ మినీ మహానాడును కోడుమూరు నియోజకవర్గంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో సహకారం అందిస్తున్నారని వివరించారు. కోడుమూరు నియోజకవర్గ పరిశీలకుడు రామలింగారెడ్డి, నాయకులు, కర్నూలు, గూడూరు, బెళగల్, కోడుమూరు మండలాల కార్యకర్తలు, సాధికార సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కల్లూరు మే 18(ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల తర్వాత ఆ విద్యార్థులు ఒక్కసారి కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అలనాటి చిలిపి చేష్టలనే కాదు, చదువులో పరస్పరం అందించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. ఆదివారం కల్లూరు మండలం, పెద్దపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి వేదికైంది. ఈ పాఠశాల్లో 1999-2000 మధ్య పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకొని ఆనందోత్సాహాలతో గడిపారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు శేషఫణి శర్మ, సావిత్రమ్మ, కృష్ణారెడ్డి, ప్రభావతమ్మ, టీపీఎల్ పద్మను పిలిపించుకొని వారిని శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. చిన్ననాటి స్నేహితులందరూ కలిసి విందు భోజనాలు చేశారు. మళ్లీ వచ్చే ఏడాది కూడా తప్పకుండా పరస్పరం కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు గాండ్ల శివనాగరాజు, దామోదర్ రెడ్డి, రాముడు, జాఫర్, సత్యసాయి, మద్దిలేటి, రాజన్న, వెంకటేశ్వర్లు, లోకేష్, రవి, శ్రీనివాసులు, సి.శ్రీను, అశోక్ పాల్గొన్నారు.



పెద్దపాడు జడ్పీ పాఠశాలలో కలుసుకున్న విద్యార్థులు

విద్యాసాగర్ ఎంపికకు ఏకగ్రీవ తీర్మానం



విద్యాసాగర్‌ను సన్మానిస్తున్న జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, మే 18(ఆంధ్రజ్యోతి): త్వరలో భర్తీ కానున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష పదవికి విద్యాసాగర్‌కు జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం తెలిపింది. ఆదివారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌ను జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు వెంగల్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దస్తగిరిరెడ్డి, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ కాశన్న, ఎం.రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులుగా విద్యాసాగర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా దస్తగిరిరెడ్డిని బలపరుస్తూ జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసి యేషన్ తీర్మాన పత్రాన్ని వారికి అందజేశారు. కార్యక్రమంలో కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరు, డోన్, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, నంద్యాల. ఆత్మకూరు, నందికొట్కూరు తాలుకా అధ్యక్షులు శ్రీనివాసయాదవ్, మద్దిలేటి, బజారి, సాయిబాబా, మోహన్,షెమిలా, వెంకటేశ్వర్లు, మునిస్వామి, నాగార్జునరెడ్డి, హుశేన్ రెడ్డి, మోహన్‌రెడ్డి, రాముడు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి బలవన్మరణం



రంగన్న (ఫైల్)

కోడుమూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి విషం తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని లద్దగిరి గ్రామంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చింతచిగురు రామదాసు కొడుకు చింతచిగురు రంగన్న(35). ఎకరా పొలంలో తండ్రీకొడుకులిద్దరూ వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో రంగన్న కూలీ పనులకు వెళ్తూ భార్యా, నలుగురు పిల్లలను పోషిస్తున్నాడు. అయితే వ్యవసాయం, కుటుంబ అవసరాలకు రంగన్న రూ.3లక్షలు అప్పులు చేశాడు. వీటిని ఎలా తీర్చాలోనని మదన పడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం సాయంత్రం పొలం వద్ద మద్యంలో విషం కలుపుకొని తాగాడు. సమాచారం అందుకున్న తండ్రి రామదాసు, భార్య సుభాత అక్కడికి చేరుకొని హుటాహుటిన కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం రంగన్న మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి రామదాసు ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఫ్లైఓవర్ నుంచి పడి వ్యక్తి దుర్మరణం



కృష్ణమోహన్ (ఫైల్)

డోన్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఫ్లైఓవర్ నుంచి ఫుట్‌పాత్‌పై పడి ఓ వ్యక్తి దుర్మణం చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి చోటుచేసుకున్నట్లు అర్బన్ సీఐ ఇంతియాజ్ ఆదివారం తెలిపారు. వివరాలు.. పట్టణంలో చిగురుమానుపేటకు చెందిన కృష్ణమోహన్(25) బైక్‌పై కొత్తబస్టాండ్ నుంచి చిగురుమానుపేటకు వెళ్తున్నాడు. ఫ్లైఓవర్‌లో బైక్ ఓవర్‌స్పీడ్ వల్ల అదుపు తప్పి కింద ఫుట్‌పాత్‌పై పడ్డాడు. తీవ్రగాయాలు కాగా హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

అప్పు చెల్లించాలని అడిగినందుకే హత్య

- కత్తులతో నరికివేత
- ప్రధాన నిందితుడి అరెస్టు
- పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య
- వీడిన పెద్దవెంకటేష్ హత్య కేసు మిస్టరీ

ఆలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): అప్పును చెల్లించాలని అడిగినందుకే పెద్దవెంకటేష్‌ను పథకం ప్రకారం హత్య చేశారని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కంటినేని సోమన్నను పోలీసులు అరెస్టుచేశారు. ఆదివారం సాయంత్రం ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య విలేకరుల సమావేశంలో హత్యకు గల కారణాలను వెల్లడించారు. అమృతాపురం గ్రామానికి చెందిన కంటినేని పెద్ద వెంకటేష్ అందరికీ వడ్డీలకు అప్పులు ఇచ్చేవాడు. బంధువు అయిన కంటినేని సోమన్నకు కూడా రూ.2.50లక్షలు అప్పు ఇచ్చా డు. డబ్బులు చెల్లించాలని వెంకటేష్ ఒత్తిడి చేయగా రూ.60వేలు వడ్డీ సోమన్న చెల్లించాడు. ఇంకా రూ.4లక్షలు అప్పు ఉందని వెంకటేష్ దబాయించాడు. సోమన్నతో తిరిగి ప్రామిసరీ నోటు రాయించుకున్నాడు. మిగిలిన అప్పు చెల్లించాలంటూ బెదిరింపులకు పాల్పడుతుండగా పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా కొనసాగింది. సోమన్న కల్యాణదుర్గం మండలం శెట్టూరులో పొలం కౌలుకు తీసుకుని అక్కడే ఉంటున్నాడు. కాగా వెంకటేష్ అప్పు చెల్లించాలంటూ సోమన్నపై కోర్టులో కేసు వేశాడు. గ్రామంలో సోమన్నకు చెందిన ఐదెకరాల పొలంను ఆక్రమించుకొని సాగుచేస్తున్నాడని, అతడి భార్యతో వివాహేతర సంబంధాన్ని వెంకటేష్ కొనసాగిస్తున్న విషయాన్ని నటరాజగౌడ్ సోమన్నకు చెప్పాడు. దీంతో ఎలాగైనా సరే వెంకటేష్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. బావమరిది ధనుంజయ్, హొళగుందకు చెందిన చాకలి నాగరాజు, అమృతాపురానికి చెందిన నటరాజగౌడ్, కర్ణాటకలోని ఉత్తనూరుకు చెందిన జోగప్ప కలిసి హత్య చేసేందుకు రూ.2 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పథకం ప్రకారమే పశువులు మేపేందుకు వెళ్లిన కంటినేని పెద్ద వెంకటేష్‌ను కత్తులతో నరికి చంపారు. ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ చంద్రతో కలిసి అన్ని దర్యాప్తు చేశారు. మిగిలిన ఐదుగురిని కూడా త్వరలోనే పట్టుకుంటామని, ప్రధాన నిందితుడు నిందితుడు సోమన్నను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

జంగముల అభివృద్ధికి కృషి

ఆదోని టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జంగముల అభివృద్ధికి నూతన సంఘం సభ్యులు కృషి చేయాలని జిల్లా జంగమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జె ఎం శివమూర్తి స్వామి అన్నారు. ఆదివారం స్థానిక చౌకీమఠంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఉన్న సంఘం కార్యవర్గాన్ని తొలగించి, కొత్త సభ్యులతో మరో కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. అధ్యక్షుడిగా జె మల్లికార్జున స్వామి, ఉపాధ్యక్షుడిగా జీయం సూర్య ప్రకాష్ స్వామి, ప్రధాన కార్యదర్శిగా జెయం శివమూర్తి స్వామి, సహాయ కార్యదర్శిగా శైలేంద్ర కుమార్ స్వామి, కోశాధికారిగా బసవరాజు ఎంపిక కాగా, సభ్యులుగా వారిని అభినందించారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

మద్దికెర, మే 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఎంతో వెనుకబడిన ప్రాంతమని, జిల్లాకు తాగునీరు, సాగునీరు అవసరమయ్యే వేదవతి, గుండ్రేవుల, గురు రాఘవేంద్ర, ఆర్డీఎస్‌ల ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని జిల్లా సీపీఐ కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఐ కార్యవర్గ సభ్యులు రాజాసాహేబ్ అన్నారు. ఆదివారం మండలంలోని బురుజుల గ్రామంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కర్నూలు జిల్లా వెనుకబడి ఉందన్నారు. 2019లో కోడుమూరులో సీఎం చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారని, ఇంతవరకు నిధులు కేటాయించలేదన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో ఉన్న 108 చెరువులకు హంద్రీనీవా ద్వారా నీరు మళ్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, బురుజుల శ్రీనివాసులు, కోదండరాముడు, బొజ్జన్న, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: మాజీ ఎంపీపీ



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు

వెల్దుర్తి, మే 18(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు అన్నారు. ఆదివారం వెల్దుర్తిలో 14వ వార్డు, 15వ వార్డులలో నెలకొన్న సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు మాజీ ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. జ్ఞానేశ్వర్‌గౌడు మాట్లాడుతూ కాలనీలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరి, గిడ్డయ్య, రాజేశ్, వీరభద్రుడు, రాజు, బజారు, అబ్దుల్లా, బ్రహ్మం పాల్గొన్నారు.



ఆదోని, పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు పార్థసారథి, శ్యాంబాబు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ఘనంగా తిరంగా ర్యాలీ

ఆదోని, మే 18 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన నేపథ్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఆదోని పట్టణంలో మునిసిపల్ మైదానం నుంచి శ్రీనివాస భవన్, పెద్ద ఆసుపత్రి కూడలి, భీమాస్ సర్కిల్ మీదుగా భారత సైనికుల కోసం పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో పార్టీలకతీతంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకునేందరుకు హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మారుతి నాయుడు, సిద్ధార్థ నాయు డు, బీజేపీ నాయకులు ఉపేంద్ర, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

పత్తికొండ: దేశరక్షణ కోసం పోరాడే జవాను వీరులకు సెల్యూట్ అని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పత్తికొండలో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు జాతీయజెండాతో ర్యాలీలో పాల్గొని ముందుకు సాగారు. అనంతరం రామాంజనేయులతో పాటు మరో జవానును పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర, మనోహర్‌చౌదరి, సురేశ్‌కుమార్, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, తిమ్మయ్యచౌదరి, చల్లారవి, కడవ సుధాకర్, రామానాయుడు, తిరుపాలు, బీజేపీ కో కన్వీనర్ గోవర్ధన్‌నాయుడు, జనసేన ఇంచార్జీ రాజశేఖర్, పత్తికొండ సీఐలు పాల్గొన్నారు.

● పత్తికొండలో ప్రత్యేక స్థానం కలిగిన తేరుబజారు మీటింగ్ కట్టను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదివారం ప్రారంభిచారు. లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు న్యాయవాది సురేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముట్టడిని జయప్రదం చేయాలి: ఎస్టీయూ

ఆదోని అగ్రికల్చర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యల పట్ల విద్యాశాఖ అసంబద్ధ విధానాలను వీడాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సీ నాగరాజు అన్నారు. ఆదివారం ఎస్టీయూ భవనంలో 21న తలపెట్టిన డీఈవో కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలపై 30 వారాలుగా ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరుపుతున్న విద్యా వ్యవస్థ పురోగతికి ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించకుండా ఏకపక్షంగా జీవోలు విడుదల చేయడం దారుణం అన్నారు. సమావేశంలో రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, పట్టణ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి భీమరాజు, రాజా సతీష్, జై రామ్ పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్లకు విప్ జారీ

● నేడు కౌన్సిల్ ఛైర్మన్ ఎంపిక

ఆదోని టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): మునిపల్ ఛైర్మన్ ఎంపిక సోమవారం జరుగుతుండంతో వైసీపీ అధిష్టానం తమ కౌన్సిలర్లుకు విప్ జారీ చేసింది. కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ వైసీపీ కౌన్సిలర్లకు ఆదివారం విప్ పత్రాలు అందజేశారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వైఎస్‌ఆర్‌సీపీ అధిష్టానం నిర్ణయించిన ఛైర్మన్ అభ్యర్థికి మద్దతు తెలపాలని ఆయన కోరారు. వైసీపీకు చెందిన కౌన్సిలర్లు నరసింహులు, బాలాజీ, అశోక్, గోవిందరాజులు, వెంటరాగ ఫయాజ్ అహ్మద్ సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు విప్ పత్రాలను అందజేశారు.

మంత్రి దృష్టికి దళితుల సమస్యలు

ఆదోని రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం 104 బసాపురం గ్రామానికి చెందిన దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి నారా లోకేశ్ దృష్టికి టీడీపీ యువ నాయకులు బసాపురం వెంకటేష్ తీసుకెళ్లారు. ఆదివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంత్రిని కలిసి గ్రామ సమస్యలను వివరించారు. 40ఏళ్లుగా ఎస్సీఎస్టీలు ప్రైవేట్ స్థలంలో కొట్టాలు వేసుకొని జీవిస్తున్నారని, మంగళగిరి తరహాలో పేదలకు పట్టాభిషేకంలోభాగంగా, వీరికి భూసేకరణ చేసి ఇంటి పట్టాలను మంజూరు చేయాలని వెంకటేష్ మంత్రిని కోరినట్లు తెలిపారు.

మార్కెట్ యార్డ్ మాజీ వైస్ ఛైర్మన్ మృతి

ఆదోని అగ్రికల్చర్, మే 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, వైసీపీ సీనియర్ నాయకుడు కురువ రాముడు (65) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య సరోజమ్మ మాజీ మునిసిపల్ ఛైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం కోడలు 25వ వార్డు వైసీపీ కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. ఈయనకు నలుగురు కుమారులు ఓ కుమార్తె ఉంది. మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి పలువురు నివాళులర్పించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తుగ్గలి, మే 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు దాదాపు 6 వారాల నుంచి వేతనాలు అందకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే కూలీలకు వేతనాలు చెల్లించాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

తుగ్గలి, మే 18 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు తెలిపారు. ఆదివారం పగిడిరాయిలో అభయాంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. వారు మాట్లాడుతూ 22న హనుమాన్ జయంతి పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు సాయంత్రం రథోత్సవం, రాత్రి లంకోత్సవం నిర్వహిస్తామన్నారు.

వడ్డీ రాయితీని రైతుల ఖాతాలో జమ చేయాలి

ఆలూరు, మే18(ఆంధ్రజ్యోతి): ఆలూరు సహకార సంఘాల్లో రైతులకు ప్రభుత్వం అందించిన వడ్డీ రాయితీని రైతుల ఖాతాలకు జమ చేయాలని, లేకపోతే అధికార్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వడ్డీ రాయితీ కోసం రైతుల ఎదురుచూపులు అనే కథనానికి ఆయన స్పందించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు జీఎం రామాంజనేయులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం మధ్యాహ్నం నాటికి రైతుల ఖాతాల్లో వడ్డీ రాయితీని జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పేదలకు సేవలు అందించడమే ఆవోపా ధ్యేయం

ఆదోని టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు సేవలు అందించడమే ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా అన్నారు. ఆదివారం మెట్రో ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన రెండవ సారి అధ్యక్షుడుగా ఎంపికై ప్రమాణ స్వీకారం చేశారు. ఆవోపా రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, కన్వీనర్ ప్రతాప్, శ్రీకాంత్, వెంకటేశ్వరులు, మాజీ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కాకుబాల్ నాగేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని కొత్త కార్యవర్గ సభ్యులను అభినందించారు.

బీసీవై పార్టీని బలోపేతం చేస్తాం

ఆలూరు, మే 18(ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మరింతగా బలోపేతం చేస్తామని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) అధినేత బోడె రామచంద్రయాదవ్ అన్నారు. ఆదివారం ఆలూరు మండలంలోని మొలగవల్లి గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి వచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని పటిష్ట పరుస్తామన్నారు.

అపూర్వ కలయిక

33 ఏళ్ల తర్వాత కలుసుకున్న వైఎంకే పాఠశాల విద్యార్థులు



గురువులతో వైఎంకే పాఠశాల పూర్వ విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎల్లే మల్లేశప్ప కన్నడ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. 1991-92 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి సి,డి సెక్షన్ పూర్వ విద్యార్థులు 33ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఆయా వృత్తులలో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడి ఇన్నాళ్ల తర్వాత కలుసుకోవడంతో నాటి స్నేహితులను చూసి ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. నాడు తరగతి గదిలో చేసిన అల్లర్లను గుర్తు చేసుకొని, తరగతి గదిలో కూర్చొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువులు చెప్పిన గురువులు మల్లికార్జున, గురులింగయ్య. అనూష, సర్వమంగళ, ప్రతాప్ సూర్య, రామచంద్ర, కర్లింగప్పలను పాదయాభివందనం చేసి జ్ఞాపకం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కే వీరేష్ కర్ని రవికుమార్, రాఘవేంద్ర, శేఖర్, మాధవ్, రమేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువుతో పూర్వ విద్యార్థులు

పత్తికొండ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఒకే హాస్టల్‌లో చదువుకున్న విద్యార్థులు 25ఏళ్ల తర్వాత ఆదివారం ఒకే చోట కలుసుకుని సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించుకున్నారు. పత్తికొండ పట్టణంలో ఆంజనేయ నగర్‌లో బీసీ బాలుర వసతి గృహం చదువుకున్న 1999-2000 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలుసుకొని ఆలింగనం చేసుకుని నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. హాస్టల్ వార్డెన్ ఇమామ్ సాహేబ్, ఉపాధ్యాయులు మాబు సాహేబ్, ఉస్మాన్ బాషాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన ఎస్ఐ గోపాలుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మురారెడ్డి, తమ్మారెడ్డి, రైల్వే ఉద్యోగి రామాంజి, ట్రాన్స్‌కో ఉద్యోగి రామాంజనేయులు, టీచర్ రవీంద్ర, సీపీఐ నాయకులు గిడ్డయ్య, పెద్దహుల్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ మేజర్‌కు సన్మానం

ఆదోని టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆర్మీలో మేజర్‌గా పని చేస్తున్న వినోద్‌ను ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మునిసిపాల్ ఛైర్మన్ దేవరాజ్ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, దేశ సరిహద్దుల్లో దేశ భద్రత కోసం ఆర్మీ చేస్తున్న సేవలు దేశ ప్రజలందరూ ఎన్నటికీ మరువలేరని కొనియాడారు. తమ ప్రాణాలకు తెగించి శత్రువులతో పోరాటం చేసే సైనికులను గౌరవించుకోవడం మన కనీస ధర్మమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోకా, పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనిత్ రాయల్, చేతన్ ధోకా నిసార్ అహమ్మద్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

పత్తికొండ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్యశిబిరాలు వినియోగించుకోవాలని కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సాయిబాబా దేవాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన కంటి జబ్బులు ఉన్న వారికి విశ్వభారతి హాస్పిటల్ వైద్యులు భాస్కర్ కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం 45 మందిని కంటి ఆపరేషన్ల కోసం కర్నూలుకు ప్రత్యేక వాహనంలో తరలించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ము నెట్టికల్లు, ఎంపీటీసీ రంగస్వామి పాల్గొన్నారు.

భారీ వర్షం

● పొంగిపొర్లిన వాగులు, వంకలు

● దెబ్బతిన్న రోడ్లు... స్తంభించిన రాకపోకలు

జిల్లాలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే ఆదివారం కూడా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

హాలహర్వి, మే 18(ఆంధ్రజ్యోతి): హాలహర్వి మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చాలా చోట్ల రోడ్లు కోతకు గురికావడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. హాలహర్వి నుంచి గూళ్యంకు వెళ్లే ప్రధాన రహదారిపై వాగు ఉధృతికి రోడ్డు కోతకు గురైంది. కొక్కరచేడు, బేవినహాల్, సిద్ధాపురం గ్రామాల్లో రోడ్లు తెగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

మద్దికెర: మండలంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షపాతం నమోదు 45 మిల్లీమీటర్లు నమోదైందని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్ష సూచన అధికారుల ఆదేశాల మేరకు అధిక వర్షాలు ఉంటాయని తెలిపారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ఉండటం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్దికెర నుంచి బురుజుల వెళ్లే రైల్వేబ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండటం వల్ల ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తుగ్గలి: మండలంలో భారీ వర్షం కురిసింది. శనివారం, ఆదివారం రాత్రి తుగ్గలి, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి మండలంలోని గిరిగిట్ల, అమీనాబాదు గ్రామాల మధ్య బ్రిడ్జి వరద నీటికి కొట్టుకపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. పత్తికొండ, తదితర గ్రామాల నుంచి వచ్చిన ప్రయాణికులు అటువైపే నిలిచిపోయారు. రాత్రి సమయం కావడంతో ప్రయాణీకులు ఇళ్లకు చేరేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



తెగిన ఆలూరు-గుంతకల్లు మార్గం రహదారి



హాలహర్విలో వాగు వద్ద కోతకు గురైన ప్రధాన రహదారి

తెగిన ఆలూరు-గుంతకల్ మార్గం

ఆలూరు: ఆలూరులో శనివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. 41.8 మి.మీ.లుగా వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ గోవింద్‌సింగ్ తెలిపారు. భారీ వర్షానికి ఆలూరు-గుంతకల్ మార్గం మధ్యలో ఉన్న కల్వర్టు తెగిపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు డీజిల్ కష్టాలు

● ఎక్కడికక్కడే నిలిచిన వాహనాలు

● ఇబ్బందులు పడ్డ బాలింతలు

ఆదోని, మే 18 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలను ఇండ్లకు చేర్చే 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాలకు డీజిల్ కష్టాలు ఎదురయ్యాయి. డీజిల్ లేక వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. స్థానిక ప్రభుత్వ స్త్రీల, చిన్నపిల్లల ఆస్పత్రిలో ఏడు'తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ' వాహనాలు ఉన్నాయి. వాటికి ప్రతి రోజు 30 నుంచి 35 లీటర్ల వరకు డీజిల్ సంబంధిత కాంట్రాక్టర్ వేయిస్తున్నారు. ఆదివారం డీజిల్‌కు సంబంధించి పెట్రోల్ బంక్ యజమానికి ఫోన్ రాకపోవడంతో డీజిల్ వేయలేదు. దీంతో ఆస్పత్రిలోనే వాహనాలు ఉండిపోయాయి. హోళగుందకు చెందిన బేబీ అనే బాలింత 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' డ్రైవర్ దగ్గరకు వెళ్లి వేడుకుంది. ఆయన మాత్రం స్పందించలేదు. బేబితో పాటు పలువురు బాలింతలది ఇదే పరిస్థితి. ఈవిషయంపై డాక్టర్ మమతను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, బాలింతలను సురక్షితంగా వారిని ఇళ్లకు వదిలేందుకు ఉన్న 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహన డ్రైవరులు డీజిల్ లేదని బాలింతలతో అన్నట్లు సమాచారం ఇచ్చింది. అయితే డ్రైవర్లతో మాట్లాడదామని పిలిపించిన వారు వాహనాల దగ్గర లేకుండా వెళ్లిపోయినట్లు సిబ్బంది చెబుతున్నారు. ఈవిషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తానని ఆమె వివరించారు.



ఆసుపత్రిలో నిలిచిపోయిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

పత్తి సాగుపై అన్నదాత దృష్టి

● 30వేల హెక్టార్లలో పత్తి సాగుకు సిద్ధం

గోనెగండ్ల, మే 18(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలు పత్తి పంట పైనే ఆశలు పెట్టుకున్నారు. అడపాదడపా అరకొర వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలాలను దుక్కిదున్ని పంట సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఎమ్మిగనూరు పరిధిలోని గోనెగండ్ల, ఎమ్మిగనూరు. నందవరం మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 45వేల హెక్టార్లలో పంట సాగు కావాల్సి ఉంది. నియోజకవర్గంలోని రైతులు ఎక్కువగా దాదాపు 30వేల హెక్టార్లలో పత్తి పంట సాగు



పొలంలో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకు గాను తమ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. చాల మంది రైతుతు ముందస్తుగా బావులు, బోర్ల దగ్గర పత్తి పంటను సాగుచేశారు. ఇప్పటికే గోనెగండ్ల మండలంలో గోనెగండ్ల, కులుమాల, అలువాల, చిన్నమరివీడు, వేముగోడు, తిప్పనూరు, బైలుప్పల, గంజహళ్లి, అగ్రహారం, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, నందవరం మండలంలో ముగతి, నాగలదిన్నె, నందవరం, మిట్టసోమాపురం, గంగవరం, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి, హలహర్వి, మచాపురం, ఫులచింత, ఎమ్మిగ నూరు, మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పంటను అధికంగా సాగు చేస్తారు. గత ఏడాది 30వేల హెక్టర్లు సాగు చేశారు. ఒక ఎకరం పత్తి పంట సాగుకు రూ. 35వేల నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడి అవుతుంది. పంట 20నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. లక్ష రూపాయల నుంచి లక్షా యాభైవేల వరకు ఆదాయం వస్తుండటంతో రైతులు పత్తి పంట పై ఆసక్తి చూపుతున్నారు. గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నంద వరం మండలాల్లో అధికంగా బావులు బోర్ల కింద సాగు చేశారు. రెండు రోజులుగా గోనెగండ్ల మండలంలో అడపాదడపా వాన పడటంతో చాల మంది రైతులు ఉదయమే తమ పొలల్లో పత్తి విత్తనాలు నాటడం మొదలు పెట్టారు. ఎంత గిట్టుబాటు ధర లేదన్నా కనీసం రూ. 6000 నుండి 8000 వరకైనా ధర పలుకుతుంది కదా.. అనే ధైర్యంతో పత్తి పంటను సాగు చేస్తున్నారు. కలుపు ఖర్చులు కూడ కొంత మిగులుతుందన్న ఆశ రైతుల్లో ఉంది. ఎమ్మిగనూరు మండలం పత్తి పంట సాగుకు పెట్టింది పేరు ప్రతి ఎడాది ఎమ్మిగనూర్ రూరల్ ఏరియాల్లో దాదాపు 12వేల హెక్టార్లలో పత్తిని సాగు చేస్తారు. గోనెగండ్ల, నందవరం, మండలాల్లో అధికంగా సాగు చేయనున్నారు. ఈ ఎడాది కూడ రైతులు ఇప్పటికే పత్తి పంటను అధికంగా సాగుచేయనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు.



పొలాన్ని దున్నుతున్న రైతు

ధర పలుకుతుందన్న ఆశతో సాగు

గడిచిన ఏడాది మొదట్లో పత్తి పంట చేతికి అందిన సమయంలో క్వింటం ధర రూ. 9000 పైగా పలికింది. ప్రస్తుతం క్వింటంధర రూ. 7000కు తక్కువ లేదు. దీంతో ఈ ఏడాది కూడా ఐదు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాను. ఎకరంకు రూ. 40వేలు పెట్టబడి ఖర్చు వస్తోంది.



- చెన్నలరాయుడు, పత్తి రైతు, గోనెగండ్ల

అంధకారంలో కాలనీలు



మిలిటరీ కాలనీలో ఇంటి ముందు విరిగి పడిన చెట్టు

ఎమ్మిగనూరు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వరుసగా రెండు రోజులు నుంచి కురిసిన వర్షాలకు చాలా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపొయి, భారీ వృక్షాలు నేలకూలి విద్యుత్ సరఫరా నిలిచి పొయింది. పలు కాలనీలు రాత్రంతా అంధకారంలో ఉండిపోయాయి. శుక్రవారం, శనివారం ఉన్నట్లుండి ఈదురు గాలులతో కూడిన భారీ వానలు పడటంతో పట్టణంలోని మీలిటరీ కాలనీలో రెండు విద్యుత్ స్తంభాలు, సోమప్పనగర్‌లో ఒక విద్యుత్ స్తంభం, ఫైనార్టీ కాలనీలో చెట్టు పడిపోవడం వలన విద్యుత్ సరఫరా వైర్లు తెగిపడిపోయి, దీంతో అయా కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు ఆదివారం ఉదయం విద్యుత్ స్తంభాలను తిరిగి యధాస్థితికి నెలకొల్పడంతో ఆది వారం ఉదయం 12గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి



నినాదాలు చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు

ఎమ్మిగనూరు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు, న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 12వ రోజు సమ్మె చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యలయం నుంచి సోమప్ప సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్ వరకు నినాదాలు చేసుకుంటూ వెళ్ళి మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మెలో కుర్చోని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు ,పంపాపతి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులు సహించం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం, మే 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడుతుందని, అప్పుడు రెండింతల చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ఆదివారం మంత్రాలయం సర్వజ్ఞ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డిని అక్రమఅరెస్టు చేయడం, రెడ్‌బుక్ రాజ్యాంగమే అవుతుందన్నారు. గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తే జగన్ మోహన్ రెడ్డి ధీటుగా సమాధానం ఇస్తారన్నారు. ఈ సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

● మంత్రాలయం నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా అనారోగ్యానికి గురైనా, మృతి చెందినా వారి కుటుంబానికి రాంపురం రెడ్డి సోదరులు అండగా ఉండి కాపాడుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ఆదివారం అనారోగ్యంతో చికిత్స పొందుతున్న రామకృష్ణ, వడ్డె బాలరాజుల ఇంటికి వెళ్లి పరామర్శించి కష్టసుఖాలు తెలుసుకున్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ఎమ్మిగనూరు రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే ప్రతిఒక్కరు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండలంలోని గుడికల్లు రోడ్డులో వాహనాలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన

ఎమ్మిగనూరు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పట్టణంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్, టీబీ వ్యాధులపై విజయ మహిళమండలి ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ మహిళా మండలి మెనేజర్ దేవేంద్ర మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు మంజుల కళాజాత బృందంచే వీధి నాటకం ద్వారా పాటల ద్వారా హెచ్ఐవి అనేది అంటు వ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పామన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా 'తిరంగా' ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న రాఘవేంద్రరెడ్డి తదితరులు

కోసిగి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ 'సిందూర్' విజయోత్సవ తిరంగా ర్యాలీ ఆదివారం సాయంత్రం కోసిగిలో మంత్రాలయం నియోజకవర్గం నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలతో కోసిగిలో మార్కెండేయస్వామి దేవాలయం నుంచి వాల్మీకి సర్కిల్ వరకు సైనికులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూసేలా చేశారని, సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి పాకిస్థాన్‌పై యుద్ధం చేస్తున్న దేశ సైనికులకు సంఘీభావం తెలిపారు. 100 మీటర్ల జాతీయ జెండాను పట్టుకుని జాతీయ జెండాలతో, దేశమాత ధ్వనులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, సురేష్ నాయుడు, రాకేష్ రెడ్డి, సతీష్ నాయుడు, బసలదొడ్డి ఈరన్న, అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, రామకృష్ణ, జ్ఞానేష్, నర్సారెడ్డి, మాణిక్యరాజు, సొట్టయ్య, కోసిగయ్య, మాలపల్లి వెంకటేశ్, లక్ష్మన్న, వెంకటేశ్, బీజేపీ నాయకులు రాముడు. సీఐ మంజునాథ్, కోసిగి, పెద్దకడుబూరు ఎస్ఐలు హనుమంతరెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువరైతుకు నివాళి

కోసిగిలోని 3వ వార్డు వాల్మీకినగర్‌కు చెందిన దొడ్డి రామయ్య, తాయమ్మ దంపతుల మొదటి కుమారుడు యువరైతు దొడ్డి నాగరాజు (19) ఆదివారం తమ పొలంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో యువ రైతు నాగరాజు మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కురువలు రాజకీయంగా ఎదగాలి



దైవందిన్నెలో కనకదాసుకు పూజలు చేస్తున్న ఎంపీ నాగరాజు

ఎమ్మిగనూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కురువలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దైవందిన్నె నూతనంగా ఏర్పాటుచేసిన కనకదాసు విగ్రహానికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కురువ కులస్తులకు ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. అన్ని కులాల వారు ఆదరించడంతోనే లక్షపైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందానన్నారు. కార్యక్రమంలో రాష్ట్రకురువ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకటరాముడు, గ్రామ టీడీపీ నాయకులు, కురువ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తకనకదాసు ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

దైవందిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన భక్తకనకదాసు దేవాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈయనకు ఆలయ నిర్వాహకులు మర్యాద పూర్వకంగా ఆహ్వానం పలికారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రమణీయం.. స్వర్ణ పల్లకీ ఉత్సవం



స్వర్ణపల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్ర స్వామి

మంత్రాలయం, మే 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రాఘవేంద్రుని స్వర్ణపల్లకీ ఉత్సవం రమణీయంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం షష్ఠి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్ఠించి రమణీయంగా ఊరేగించారు. బృందావనానికి బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, గులాబి పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి హారతులు ఇచ్చారు. శ్రీమఠంలో వైభవంగా శ్రీరాఘవరాయుడి ఊం జలసేవ చేశారు. ఆదివారం వైశాఖ షష్ఠి శుభ దినాన్ని పురస్కరిం చుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో మఠం దివాన్ శ్రీనాథ్ ఆచార్ రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను యాగశా లలో వెండి ఊయలలో అధిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. శనివారం రాత్రి నుంచి భక్తుల తాకిడి మరింత పెరిగింది. ఆదివారం సెలవు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహరాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి దాదాపు 60 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిర్సింది.

రాఘవేంద్రుని సన్నిధిలో వనపర్తి జిల్లా ఎస్పీ గిరిధర్

తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా ఎస్పీ గిరిధర్ కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు మఠం జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహ మూర్తి, వ్యాసరాజాచార్, దేశాయి నరసింహ ఘనంగా స్వాగతం పలికారు. వీరి వెంట మఠం మేనేజర్ వెంకటేష్ జోషి, జయతీర్థ ఆచార్, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునస్వామి, నాగరాజు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వామిసేవలో హాస్య నటులు

జబర్దస్త్ హాస్య నటులు అదుర్స్ ఆనంద్, ఫాణి, నాగతేజ్, ఫోర్‌లెగ్స్ బాబు ఆదివారం రాత్రి మంత్రాలయంకు వచ్చారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. జబర్దస్ టీం నటులతో అభిమానులు ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. అనంత వ్యాసరాజ్ ఆచార్, సూపరింటెండెంట్ జేపి స్వామి, జయతీర్థ ఆచార్, ద్వారపాలక అనంత స్వామి పాల్గొన్నారు.

'ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైస్‌కార్డులను నమోదు చేసుకునేందుకు వెళ్లే లబ్ధిదారులతో సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అంతేగాక ఇప్పుడు సర్వర్ పనిచేస్తున్నప్పటికి ఇప్పుడు సర్వర్ పనిచేయడంలేదు మళ్లీ రాపోండి.. అంటూ లబ్ధిదారులను రెండు మూడు సార్లు సచివాలయాల చుట్టు తిప్పుతున్నారన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మీకు రైస్ కార్డు కావాలంటే వేచి ఉండడండి.. లేదంటే వెళ్లండి అంటూ సమాధానాలు చెబుతున్నారన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, మే 18(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎంపికైన గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కెమిస్ట్రీ భవన్‌లో నందవరం మండలంలోని గురుజాల, మిట్టసోమాపురం, పొనకలదిన్నె, కనకవీడు, నాగలదిన్నె గ్రామాల టీడీపీ గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాయకులు పెద్దరాముడు, రామకృష్ణారెడ్డి, జబ్బార్, భీమా, రఘు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పెద్దకడుబూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): పొలం తగాదా విషయంలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన చంద్రకళ బాపులదొడ్డి గ్రామంలో రెండు ఎకరాల పొలాన్ని కొన్నాడు. ఈ పొలాన్ని పెద్దతుంబళం గ్రామానికి చెందిన గడిగ ఈరన్నకు గుత్తకు ఇచ్చిందన్నారు. అయితే పొలం అమ్మిన బైని ఈరన్న చంద్రకళకు తెలియకుండ విత్తనాన్ని సాగుచేయబోయాడు. విషయం తెలుసుకున్న చంద్రకళ తమ పొలంలో విత్తనసాగు ఎలా చేస్తారంటూ ప్రశ్నించడంతో చంద్రకళతో పాటు లక్ష్మీ, డ్రైవర్ అబ్దుల్లాలపై బైని ఈరన్న దాడి చేశాడు. బాధితురాలు చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్లపై నిలిచిన వర్షపు నీరు



షాపుల ముందు నిలిచిన వర్షపు నీరు

ఎమ్మిగనూరు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోతోంది. మునిసిపల్ కార్యాలయానికి కూత వేట దూరంలో, బాలికల ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న షాపుల ముందు వర్షా కాలం వచ్చిందంటే చిన్న పాటి చెరువును తలపిస్తోంది. ఈసమయంలో దుకాణ దారులకు కూడా కష్టాల తప్పడం లేదు. వర్షపు నీరు నిలిచిపోవడానికి ఇక్కడ డ్రైనేజీలు లేకపోవడం ముఖ్య కారణం. అధికారులు స్పందించి సంత మార్కెట్, బాలికల ప్రభుత్వ పాఠశాల దగ్గర, గోనెగండ్ల సర్కిల్, ఇందిరానగర్ మెయిన్ రోడ్డు, కమిటీ రోడ్డు, బడెసాబ్ దర్గా దగ్గర డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజులుగా భారీ ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తుం డడంతో పట్టణ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఆశ బ్ధాలకు జనం ఆందోళనకు గురవుతున్నారు

'హక్కులకు భంగం కలిగిస్తే సహించం'

ఎమ్మిగనూరు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల హక్కులకు భంగం కలిగిస్తే సహించబోమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షులు దేవసహాయం, దళిత రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అరెకంటి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడు తూ జీవో నెంబర్ 342 ఉత్తర్వుల ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులు పదోన్నతుల కొసం ఉన్నత చదువుల నిమిత్తం రెండు సంవత్సరాలు స్టడీ లీవ్‌లో ఉండి చదువుకునే ఆవకాశంను 1977లో నుండి కల్పించా రన్నారు. కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా 342జీవోతో లీవ్ ఉపయోగించుకుంటూ ఉన్నత చదువులు అభ్యసిస్తుంటే నిబంధనలు పేరుతో వారిని ఉన్నత విద్యకు దూరం చేయాలనే విద్యాశాఖ తీరును ఖండిస్తున్నామన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఆర్టీవో పలు సేవల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆటోస్టాండ్ దగ్గర ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 20న దేశ వ్యాప్త నిరసనకు ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేణు, బాలు, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

ముళ్లకంపతో నిండిన హంద్రీనది



తిప్పనూరు సమీపంలో హంద్రీనదిలో పెరిగిన ముళ్ల పొదలు

గోనెగండ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేముగోడు, తిప్పనూరు, లింగందిన్నె, హెచ్. కైరవాడి పుట్టపాశం గ్రామాల పరిధిలో ప్రవహిస్తున్న హంద్రీనదిని ముళ్ల పొదలు కమ్మేశాయని ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. నదిలోకి అడుగు పెట్టాలంటే ఇబ్బందిగా మారిందని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు తెలుపుతున్నారు. పెరిగిన ముళ్ల పొదల కారణంగా హంద్రీలోని భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు. హంద్రీలోని నీటి పథకాల కోసం ఏర్పాటు చేసిన బోర్ల దగ్గరకు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పొదలు పెరిగి పోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధిహామీ పథకం కింద ముళ్ల పొదలను తొలగించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.